# వేమూరి విజయ్, దేవి




## విజయ్



అప్పటికి నేను అమెరికా వచ్చి రెండేళ్ళు దాటింది. పెళ్ళి విషయం వచ్చేసరికి మా అమ్మావాళ్ళు నా అభిప్రాయం కోసం కొన్ని ఫోటోలు పంపించారు. నాకు అందులో ఒకటి నచ్చినప్పటికీ నా అభిప్రాయం మావాళ్ళకి చెప్పలేదు. డిసెంబర్ 2000లో నాకు అనుకోకుండా సెలవు దొరికింది. హుటాహుటిన కబురు చేసి హైదరాబాదు వెళ్ళాను. మావాళ్ళు నా పెళ్ళి గురించి ఎంత సీరియస్‌గా ఉన్నారో అప్పటికిగానీ తెలియలేదు. ఈ విషయం ఇంత త్వరగా నిర్ణయించుకోవాల్సి వస్తుందని నేను అనుకోలేదు. అలాగని నాకు నచ్చిన అమ్మాయి తాలూకు వాళ్ళను కాంటాక్ట్ చేయడం సాధ్యపడలేదు. మరికొన్ని సంబంధాలు జాతకరీత్యా మా వాళ్ళకి నచ్చి సెలెక్ట్ చేసినా నాకు నచ్చలేదు.

ఇక లాభం లేదని పేపర్లో ప్రకటన వేయించారు. అప్పటికి నాకు చాలా తక్కువ గడువు ఉంది. మరో రెండు వారాలు మాత్రమే. ఇక అప్పటినుంచీ ఫోనులు రావటం, మాట్లాడటం మానాన్నగారికి హెక్టిక్ అయింది. మరికొన్ని సంబంధాలు చూసి ఇక జాతకాలు తీసి పక్కనపెట్టి నిర్ణయించాలని నిశ్చయించుకున్నాము. వచ్చిన అన్ని ఫొటోస్‌లో ఒకటి నన్నాకర్షించింది. ఊరు పార్వతీపురం అన్నారు. నేనసలు అటువైపే వెళ్ళలేదు. ఉన్న తక్కువ సమయంలో మేమంతా వెళ్ళడం సాధ్యపడదని గ్రహించి, వాళ్ళనే రావలసినదిగా కబురు చేసారు. కానీ అది వాళ్ళకి కూడా కష్టమని చెప్పారు. ఎలాగైనా మానేజ్ చేయాలని రిక్వెస్ట్ చేసాము. సరేనని వాళ్ళ అమ్మగారు ఒప్పుకున్నారు.

మా ఇంట్లో సాయిబాబా భజన ఏర్పాటు చేసిన రోజున వాళ్ళు వచ్చినట్లు మాకు కబురు చేసారు. తీరా వెళ్ళిన తరువాత తెలిసింది తను ఒక్కరే వైజాగ్ నించీ వచ్చిందని. వాళ్ళ దగ్గర బంధువుల ఇంట్లో మేమిద్దరం మొదటి సారిగా కలుసుకోవటం జరిగింది.

ముందు మా నాన్నగారు తనతో సంభాషించారు. పక్కనే నేను మా అమ్మ. అంతసేపు తను నావంక చూడాలనిపించి కూడా అసలు చూడకపోవటం గమనించాను. తరువాత మావాళ్ళు తన బంధువులతో వేరే గదిలోకి వెళ్ళి మమ్మల్ని కొంచెంసేపు వదిలేసారు.

ఇలా హడావుడి చేసి ఇంత తక్కువ సమయంలో తనని పిలిచి ఇబ్బంది పెట్టినందుకు చాలా ఫీలయ్యానని చెప్పాను.



కనీసం ట్రైనులో బెర్త్ దొరికిందా అని అడిగాను. అవతల మౌనం. మరొకసారి సారీ చెప్పాను. తన గురించి, తన ఉద్యోగం ఇంకా మరిన్ని విషయాలు తెలుసుకుని, నా గురించి నా ఉద్యోగం బే ఏరియా గురించి వివరించాను. మేము వెళ్ళటానికి లేచాము. సరిగ్గా తను కూడా అప్పుడే లేచి మా ఇద్దరి హైట్ కంపేర్ చేసుకోవడం గమనించాను. ఇక మేము అక్కడనుండి కదిలాము.

నేను అమెరికా వచ్చేసిన 3 నెలలకిగాని, ఆమెతో తిరిగి సంభాషించే భాగ్యం కలగలేదు (ఫోన్లో). ఈలోగా నా ఫోటోలు మరికొన్ని అడిగారు. నేను మాత్రం తన ఫొటోని అమెరికాకి తెచ్చుకున్నాను. ఏప్రిల్ 2001 లో మా పెళ్ళైంది. అమెరికాలో నేను గడిపిన రెండేళ్ళు రెండు యుగాలుగా, పెళ్ళయి గడిపిన అయిదేళ్ళు (ఇప్పటికి) అయిదు క్షణాల్లా గడిచిపోయాయి.



## దేవి



నేను వైజాగ్‌లో ఉద్యోగం చేస్తున్న రోజులవి. అప్పటికి మావాళ్ళు కొన్ని సంబంధాలు చూడటం జరిగినప్పటికీ అమెరికా సంబంధం చెయ్యాలని మావాళ్ళకి ఉండేది. ముఖ్యంగా మా అక్కయ్య పట్టుదలగా ఉండేది. పెళ్ళిగురించి, నాక్కాబోయే భర్తగురించి కలలు కనటమే జీవితంలా ఉండేదాన్ని. నా స్నేహితురాళ్ళ దగ్గరనుంచీ ఇంట్లోవాళ్ళ వరకు అందరూ అనేవాళ్ళు, "నీకింత మొగుడి పిచ్చేంటే" అని. ముఖ్యంగా సంప్రదాయాలన్నా పద్ధతులన్నా నాకెంతో గౌరవం.

అటువంటిది, అమెరికా సంబంధం అంటే ఎలాంటివాళ్ళో అన్న భయం ఒకటి ఉండేది. అయినాసరే అక్కయ్య ముమ్మరంగా ప్రయత్నాలు చేసేది. ఆ సందర్భంగా ఒక పేపర్ ప్రకటనను తను చూడటం, తనే ఫోన్ చేసి మాట్లాడటం చేసింది.

తరువాత అన్నీ హడావిడిగా జరిగాయి. సూటిగా నాతో చెప్పకుండా, మా అమ్మ, అన్నయ్య తో మాట్లాడించి, నాతో సెలవు పెట్టించి ఎలాగైతేనేం ఒప్పించి, హైదరాబాదులో మా బంధువుల ఇంటికి పంపించారు. ఇంత హడావుడి చేస్తున్న ఆ అమెరికా సంబధం వాళ్ళ మీద కొంచెం కోపం వచ్చింది. సమయానికి ట్రైను దొరక్కపోవటం వలన బస్ ప్రయాణం చెయ్యక తప్పలేదు. మర్నాడు మధ్యాహ్నంకి గానీ వాళ్ళు రావడం సాధ్యపడలేదు. సాయిబాబా భజన వలన కొంత లేట్ అవుతుందని మాత్రం తెలిసింది.

విజయ్, వాళ్ళ అమ్మ, నాన్నగారితో వచ్చారు. వాళ్ళ నాన్నగారు వివరాలు అడుగుతున్నంత సేపు అతడిని చూడకుండా ఉండటానికి చాలా ప్రయత్నించాల్సివచ్చింది. అందులోను మావాళ్ళు రాకపోవడంతో నేనే మాట్లాడాల్సి వచ్చింది. విజయ్ నాతో వైజాగ్ నుంచీ పిలిపించి ఇబ్బంది కలిగించడం గురించి ప్రస్తావించి కొంచెం బాధపడ్డాడు. తరువాత మరికొన్ని విషయాలు మాట్లాడుతూ సమయం చాలా తొందరగా గడిచింది. ఆ సందర్భంగా మా అక్కయ్య డైవర్స్ గురించి చెప్పటం, అతను దాన్ని చాలా చిన్న విషయంలా తీసుకోవడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ఈ విషయమై తొందరపడి స్వయంగా నేనే చెప్పటం గురించి తర్వాత మా వాళ్ళు నన్ను తెగ చీవాట్లు పెట్టటం వేరే విషయం.

వాళ్ళు ఒప్పుకోవడం, మరికొద్ది నెలలకు మా పెళ్ళి జరగటం, ఆఖరి నిమిషంలో వీసా పోస్ట్‌లో రావటం, ఆశ్చర్యం, ఆనందం కలుగుతుంటుంది. విజయ్ వాళ్ళ నాన్నగారు నా హాస్టల్‌కి రావటం, మాఊళ్ళో మావాళ్ళతో

మాట్లాడం, విజయ్ ఫోటోలు ఇవ్వడం, విజయ్ అమెరికానుంచీ ఫోన్ చెయ్యడం అన్నీ ఒక్కొక్కటి గుర్తొస్తుంటే ఒక తీపి అనుభూతి.






